క్లుప్తంగా...

'సేవ్ ఓయూ'పై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: సేవ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం అనే అంశం పై నేడు (15న) సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10.30 నిమిషాలకు రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆకునూరి మురళి, ప్రొ.హరగోపాల్, ప్రొ.కోదండరామ్, ప్రొ.అన్సారీ, ప్రొ.రమామేలొకటే తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

అడ్డంకులు సృష్టిస్తున్నారు

● ప్రొ.అన్సారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు ప్రతి విషయంలోనూ అడ్డంకులు సృష్టిస్తున్నారని విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు. నోడ్యూస్ సర్టిఫికెట్ కోసం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీలో చేపట్టిన దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఉద్యోగంలో చేరి నాటి నుంచి పదవీ విరమణ వరకు ఓయూ అధికారులు అనేక విషయంలో ఇబ్బందులు పెడుతూనే ఉన్నారన్నారు. తనకు మూడు సంవత్సరాల క్రితం ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించినా అసోసియేట్ ప్రొఫెసర్ వేతనాన్ని చెల్లిస్తున్నారని వివరించారు. ఉద్యోగ విమరణ చేసి ఐదు నెలలు గడుస్తున్న ల్యాబ్ టాప్ బాకీ ఉందనే నెపంతో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

బన్సీలాల్‌పేట్: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్‌లో నూతన రోడ్డు నిర్మాణం కోసం తవ్వకాలు సాగించిన ప్రాంతాన్ని బుధవారం ఆమె ఆమె సందర్శించారు. రోడ్డు నిర్మాణ సమయంలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల కు ఎలాంటి డ్యామేజీ లేకుండా ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి ముందు డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లపై దృష్టి సారించాలన్నారు. పాన్‌బజార్‌లో చెత్తా చెదారం శుభ్రం చేయడం లేదని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని సందర్శించి పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు.

మేకలమండి పాఠశాలలో అక్షరాభ్యాసం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేరిన ఎల్‌కేజీ విద్యార్థులకు మంచుకొండ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచుకొండ ఫౌండేషన్ ట్రస్టీ వరుణ్‌కుమార్ విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. పేద విద్యార్థుల విద్యా వికాసం కోసం తమ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

లాలాపేట: జీవో నెంబర్ 58 ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, పేద ప్రజల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామంటున్న రూ. 3 లక్షల ఆర్థిక సహాయాన్ని రూ. 5 లక్షలకు పెంచాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అజయ్‌బాబు, శ్రీనివాస్, గోపాల్, కిరణ్‌కుమార్, లతీఫ్, కృష్ణమూర్తి, భీమయ్య, రాములమ్మ, లక్ష్మీ, ఆండాలు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే ధ్యేయం

గాంధీఆస్పత్రి : ఆరోగ్య తెలంగాణ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో తెలంగాణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు జరిగాయని, హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యయంత్రాలు, నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అనంతరం 1500 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని రంగవల్లులు, బతుకమ్మలతో అలంకరించి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఆర్ఎంఓ-1 జయకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, చీఫ్ డైటీషియన్ రమేష్ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి పాఠశాల ఓయూకు తరలింపు

ఉస్మానియా యూనివర్సిటీ: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ హై స్కూల్‌ను ఓయూ క్యాంపస్‌లోని మోడల్ స్కూల్‌కు తరలించారు. కొత్త భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంల ఏడాది పాటు సీతాఫల్‌మండి స్కూల్ ఓయూలో కొనసాగనుంది. ఉదయం 7 నుంచి 12.30 వరకు హై స్కూల్, మధ్యాహ్నం 1 నుంచి 4.30 వరకు ప్రాథమిక విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు.

బడులు ఇలా.. చదువు సాగేదెలా!



గాస్‌మండి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతులు

కానరాని కనీస వసతులు | ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు | దృష్టి సారించాలంటున్న తల్లిదండ్రులు | విస్మరిస్తున్న అధికారులు

సాక్షి ఫోకస్

పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బడుల వైపు అడుగులు వేశారు. అయితే.. దాదాపుగా అన్ని పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కట్లకు గురవుతున్నారు. మరమ్మతుల పేరిట నెలల తరబడి పనులు చేస్తుండటంతో ఆవరణ, ఇతర గదుల్లో పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్లు, సరైన నీటి వసతి లేక బాలికలు, ఉపాధ్యాయినులు కాలకృత్యాలకు సమీపంలోని ఇళ్లల్లోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలల్లో అన్ని వసతులు త్వరితగతిన కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాలకృత్యాలకు సమీపంలోని ఇళ్లల్లోకి..



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడుపల్లి తిరుమలగిరి మండలాల పరిధిలోని 14 ఉన్నత, 32 ప్రాథమిక, 15 ఎయిడెడ్ పాఠశాలల్లో 8 వేల మంది చదువు కుంటున్నారు. పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక అవస్థలు పడుతున్నారు. మన బస్తీ, మన బడి పథకం పలు పాద్వారా పాఠశాలల అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్న అన్ని పాఠశాలల్లో పనులు మందకోడిగా కొనసాగుతున్నాయి. సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు లేక ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులచే పాఠశాలల నిర్వహణ గత పదిహేనేళ్లుగా ఒకే మండల విద్యాధికారి రెండు మండలలా నిర్వహణ చూసుకుంటున్నారు. మడ్‌ఫోర్ట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో మనబస్తీ-మనబడి పథకం ద్వారా మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మాణం గతేడాది నుంచి కొనసాగిస్తున్నారు. పాఠశాలల్లో 950 మందికి పైగా విద్యార్థులు 45 మందికిపైగా ఉపాధ్యాయులు ఉన్నారు. మహిళా ఉపాధ్యాయులు సమీప ఇళ్లల్లోకి వెళ్లి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. బాలికలు తమ ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బోయిన్‌పల్లి బాలుర ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో మరుగుదొడ్ల, మూత్రశాలల పరిస్థితి అధ్వాన స్థితిలో ఉన్నాయి. పక్కన నిర్మానుష్య ప్రదేశం ఉండడంతో పాఠశాలల్లోకి పాములు వస్తున్నాయి. తాడ్‌బంద్ పాఠశాలకు బోర్డు అధికారులు ఇటీవల తాళాలు వేశారు. మంగళవారం సీఈవో మధుకర్ నాయక్ సందర్శించి పాఠశాల స్థలం తమదని ఉపాధ్యాయులకు చెప్పారు. బుధవారం బోర్డులు పాతించారు. పాఠశాల ప్రస్తుతం మూసివేశారు.

వసతుల లేమి..

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొత్తం 75 పాఠశాలలు ఉండగా, వీటిలో 9 ఉన్నత పాఠశాలలు, 69 ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్నాయి. సింహభాగం స్కూళ్లలో కనీస వసతి, సౌకర్యాలు లేవని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. పలు పాఠశాలలు జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాళ్లలో కొనసాగడం గమనార్హం.

ఐదేళ్లుగా ఉపాధ్యాయుల కొరత..

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో నల్లగుట్ట ఉర్దూ స్కూల్ కొనసాగుతుంది. ఇక్కడ గత ఐదేళ్ల నుంచి ఇంగ్లిష్, ఉర్దూ, తెలుగు టీచర్లు తప్పా మిగతా సబ్జెక్టుల లేరు. గత ఐదేళ్ల నుంచి ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. సోషల్, సైన్సు, మ్యాథ్స్‌కు సంబంధించిన 5 మంది ఉపాధ్యాయులు ఇక్కడ అవసరం ఉండగా కేవలం లాంగ్వేజ్ ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్నారు.ఈ ప్రాంతంలో ఉండే ప్రభుత్వ ఉర్దూ స్కూలు ఇదొక్కటే కావడంతో బేగంపేట, రసూల్‌పూరా, పాటిగడ్డతో పాటు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. కానీ ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది.

నల్లగుట్ట ఓల్డ్‌లో సైతం..

నల్లగుట్ట (ఓల్డ్) ప్రభుత్వ పాఠశాలలో ప్రైమరీ, హైస్కూల్ కొనసాగుతున్నాయి. ఇక్కడ విశాలమైన భవనం, విశాలమైన గ్రౌండ్, మూత్రశాలలు, మంచినీళ్ల సౌకర్యాలు ఉన్నాయి. కానీ ఇక్కడ కూడా ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. ప్రాథమిక పాఠశాలలో 6 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా కేవలం 4 మాత్రమే ఉన్నారు. హైస్కూల్‌లో కూడా సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు లేరు.

కొనసా..గూ తున్న మరమ్మతులు..

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్‌లోని గాస్‌మండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా విద్యాబోధనకు విఘాతం కలుగుతుంది. విద్యా సంవత్సరం ప్రారంభం అయిన వేళ కాంట్రాక్టర్ పనులు చేస్తుండటంతో పాఠశాలను ఆవరణలోని స్వచ్ఛంద సంస్థ హాస్టల్ రూమ్‌లలో తరగతులు నిర్వహిస్తున్నారు. 1-5 వరకు తరగతుల్లో సుమారు 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. మన ఊరు-మన బడి కింద 15 రోజుల క్రితం పాఠశాల పునర్నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయకపోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారుల బాధ్యతారాహిత్యం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్య మే ఇందుకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

600 విద్యార్థులకు 6 మంది ఉపాధ్యాయులు

- బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకల మండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు 600 విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అంటే సుమారు 15 మంది ఉపాధ్యాయులు ఉండాలి. అయితే ఇక్కడ మాత్రం 6 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని దాత సహకారంతో పలువురు ఉపాధ్యాయులను పెట్టి విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా చూస్తున్నారు. మరో 9 మంది ఉపాధ్యాయులను ఇక్కడ నియమించాల్సిన అవసరం ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- హైదర్‌బస్తీలోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మా రక పాఠశాలలో పాత బ్లాక్‌లో నిర్మాణాలు జరి గితే విద్యార్థుల విద్యాబోధనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయనేది ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులే గదులు ఊడ్చే దుస్థితి..

సనత్‌నగర్: ఒకే భవనం..ఐదు పాఠశాలలు.. దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు. ఆ పాఠశాలల నిర్వహణ అంతంత మాత్రమే. సమస్యల సుడిగుండంలో విద్యార్థి లోకం కాలం వెళ్లదీస్తోంది. సనత్‌నగర్ అశోక్‌కాలనీలో ఒకే భవనంలో తెలుగు, ఉర్దూ మాధ్యమాలకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు బీకేగూడ ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. పాఠశాలలో ఒక్క స్వీపర్ కూడా లేకపోవడంతో విద్యార్థులే తరగతి గదులను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితులు ఆ పాఠశాలలను ఎప్పటి నుంచో వెంటాడుతున్నాయి. దీంతో పాటు అదనపు గదుల సమస్య తీరడం లేదు. ప్రస్తుతం ఉన్న భవనంపై అదనపు గదుల నిర్మాణ ప్రతిపాదన చేయడమే కాదు.గతంలో నిధులు కూడా మంజూరైనప్పటికీ ఆ ప్రక్రియ ముందుకుసాగడం లేదు. ప్రైవేటు సంస్థల ఉదారతతో వాచ్‌మెన్‌ను నియమించుకోవడం ద్వారా ఇక్కడ అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట మాత్రం వేయగలిగారు.

అదనపు గదులు అవసరం..

సనత్‌నగర్ ప్రభుత్వ రౌండ్‌టేబుల్ స్కూల్‌ను సైతం అదనపు గదుల నిర్మాణం వెంటాడుతోంది. ఈ స్కూల్‌లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కొనసాగుతుండగా 500 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో అదనపు గదుల నిర్మాణం జరిపినప్పటికీ పెరుగుతున్న విద్యార్థులతో సరిపోవడం లేదు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు అదనంగా నిర్మించాల్సిన అవసరం ఉంది.

అరకొర ఉపాధ్యాయులతోనే..

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని పలు ప్రభుత్వ స్కూళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ప్రతి ఏడాదిలాగే ఈ సారి సైతం విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలికాయి. గత కొన్ని ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పాఠశాల ఆవరణ పరిశుభ్రత, టాయిలెట్‌ల నిర్వాహణ కష్టతరంగా మారింది. లాలాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు టీచర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరితోనే కానిచ్చేస్తున్నారు. సైన్స్, తెలుగు, హిందీ టీచర్ల కొరత ఉంది. గతంలో విద్యా వలంటీర్లతో ఉపాధ్యాయుల కొరతను కొంత వరకు అధిగమించేది. కానీ గత కొన్ని సంవత్సరాల నుంచి విద్యా వలంటీర్లను నియమించకపోడంతో బోధనకు ఇబ్బందిగా మారింది.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

మంత్రి తలసాని యాదవ్



న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనే వాళ్లని కానీ.. నేడు నే పోతాబిడ్డా సర్కారు దవాఖానాకు అంటున్నారన్నారు. 2014లో ముందు రూ.2026 కోట్లు వైద్య, ఆరోగ్యశాఖ బడ్జెట్ ఉండగా ఇప్పుడు రూ.12,600 కోట్లు కేటాయించారని, నాడు కేవలం 4 మెడికల్ కాలేజీలు ఉండగా ఇప్పుడు జిల్లాకొకటి చొప్పున 32 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి ఎంబీబీఎస్, పీజీ సీట్లు పెంచుకోగలిగామని మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో కేవలం 900 పడకలు ఉండగా ఈ రోజు ముఖ్యమంత్రి కేసీఆర్ 2000 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో పాటు ఆయన ఉద్యమ సమయంలో ప్రతి ప్రాంతంలో తిరిగి తెలంగాణ ప్రజల అవసరాలు తెలుసుకుని పేద ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, వైద్య అధికారుల సేవలతో తెలంగాణ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని కితాబునిచ్చారు. గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్స్ పథకాన్ని జిల్లాలో ప్రారంభించి వాటిని అందించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి 2014 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధి, మార్పుల గురించి నివేదిక అందించారు. ఇప్పటి వరకు 161 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయగా త్వరలో మరో 7 ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్లు మహేశ్వరీ, హేమలత, గాంధీ ఆస్పత్రి ఆర్ఎంవో జయకృష్ణ, ఎస్పీహెచ్‌వో రాజశ్రీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హెల్త్ హబ్‌గా తెలంగాణ..

బన్సీలాల్‌పేట్: మహిళల ఆరోగ్య పరిరక్షణ ద్వారానే ఇల్లు పదిలంగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని నాగెల్లి దుర్గయ్య ప్రభుత్వ స్మారక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. నేడు తెలంగాణ హెల్త్ హబ్‌గా విరాజిల్లుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సదుపాయాల మూలంగా ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అత్తెల్లి అరుణగౌడ్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ శృతి తదితరులు పాల్గొన్నారు.


మత్తు పదార్థాలను నియంత్రించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: మద్యం, మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాల నుంచి బాలలను రక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. 'మద్యం, మాదకద్రవ్యాల రక్కసి' నుంచి మన బాలలను రక్షించుకుందాం అనే నినాదంతో తుకారాంగేట్ నుంచి అడ్డగుట్ట అంజయ్య విగ్రహం వరకు సీఆర్పీఎఫ్, మదర్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు అందరూ సంఘటితంగా ఉద్యమించాలన్నారు. కొందరు చిన్న వయస్సులోనే వాటికి అలవాటు పడుతున్నారని, వాటిని నియంత్రిస్తే బాలల భవిష్యత్ బాగు పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మాదక ద్రవ్యాలను విక్రయించే బస్తీలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై తరుచూ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మదర్స్ కమిటీ కన్వీనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సాయిలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు విజయ రావు, ఆర్. మల్లేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లక్ష్మణ్, రమాదేవి, లక్ష్మీనారాయణ, ఏపీఎం స్వామి, జమున, లక్ష్మి, రామలీల, సువర్ణ, భాగ్య, రమేష్ పాల్గొన్నారు.

బీజేపీలో కంటోన్మెంట్ నేతలకు కీలక పదవులు



మల్లికార్జున్, పరుశరామ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కంటోన్మెంట్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కంటోన్మెంట్‌కు చెందిన ఇద్దరు నేతలకు అవకాశం దక్కింది. సీనియర్ నేత భానుక మల్లికార్జున్, బోర్డు మాజీ ఉద్యోగి పరుశరామ్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వివిధ జిల్లాల నుంచి ఎంపిక చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాబితాను విడుదల చేశారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా నుంచి మొత్తం ఆరుగురికి అవకాశం దక్కగా, వీరిలో ఇద్దరు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన వారు. రాష్ట్ర కమిటీలో స్థానం దక్కించుకున్న మల్లికార్జున్, పరుశరామ్‌లకు 1,6 వార్డులకు చెందిన బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌లో చేరిన నోముల ప్రకాష్‌రావు



నోముల ప్రకాష్‌రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

చిలకలగూడ : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ నోముల ప్రకాష్‌రావు కాంగ్రెస్‌లో చేరారు. బీఎస్ఆర్ గార్డెన్స్ నుంచి వేలాది మంది నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరిన ఆయన వెంకన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సీతాఫల్‌మండిలో అంబేడ్కర్, చిలకలగూడలో మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి గాంధీభవన్‌కు తరలి వెళ్లారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకుడు గౌరీశంకర్ నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా సందర్భంగా నోములకు రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్ శ్రీనివాస్, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్, దీపక్‌జాన్, జగదీశ్వరరావు, షకిల్‌ఖాన్, వహిదుద్దీన్, నర్సింహ, పాల్గొన్నారు.

ఉద్యోగాల పర్మనెంట్ కోసం మంత్రులు ఎమ్మెల్యేలతో సంప్రదింపులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలంగాణ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ పరుశురామ్ తెలిపారు. రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ నేతలు నేతృత్వంలో ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి ఉద్యోగాల పర్మనెంట్ కోసం సీఎం కేసీఆర్‌కు లేఖలు రాయాలని కోరుతున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల వరకు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేసేలా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు పరుశురామ్ పేర్కొన్నారు.

మహిళా ఆరోగ్యానికి ప్రాధాన్యం

సనత్‌నగర్: కార్పొరేట్‌లకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందుతుందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సనత్‌నగర్, ఈఎస్ఐ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడారు. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకు వచ్చారన్నారు. గర్భిణి సమయం, ప్రసవం తరువాత వారి ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా యూపీహెచ్‌సీ డాక్టర్లు సౌమ్య, శిల్ప, నాయకులు కొలను బాల్‌రెడ్డి, పుష్పలత, ఝాన్సీ పాల్గొన్నారు. అనంతరం 'మహిళ ఆరోగ్యం-ఇంటికి సౌభాగ్యం' పోస్టర్లను విష్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

సనత్‌నగర్: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు నిచ్చింది. బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ వివరాల ప్రకారం..మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం తాగి మొదటిసారి ఇద్దరు, రెండోసారి ఇద్దరు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా వారికి జైలు శిక్ష విధించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బొల్లారం నుంచి గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు లైట్ బ్లూ కలర్ ఫుల్‌షర్ట్, గ్రీన్ కలర్ లుంగీ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

అడ్డగుట్ట: రైలులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని రాయ్‌ఘర్ ప్రాంతానికి చెందిన దీపేంద్ర సాగర్(31), ఒడిస్సాకు చెందిన పరిక్షిత్ స్వేన్(33) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారు. లింగంపల్లి నుంచి తాండూర్ రైల్వే స్టేషన్లలో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో వీరిద్దరిని అదుపులోకి తీసుకుని 45.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం



బౌద్ధనగర్: దుకాణానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరాల ప్రకారం.. జామై ఉస్మానియా ప్రాంతానికి చెందిన రవీందర్(52) సెక్యూరిటీ గార్డ్‌గా పని చేసేవాడు. నాలుగు నెలల క్రితం ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం దుకాణానికి వెళ్తానని చెప్పి వెళ్లిన ఎంతసేపటికీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో భార్య పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో యువతి..



చిలకలగూడ : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి మైలార్‌గడ్డకు చెందిన ఫరియా మేగ్‌నాజ్ (25) అమెజాన్ సంస్థలో పని చేస్తుంది. ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాత్రైనా రాలేదు. సన్నిహితులు, బంధువుతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తల్లి ముబాకర్ మసూద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.